# లైన్ క్లియర్

వీధిలో చివరి ఇల్లు లాయర్ రాఘవ రావుది! ముగ్గురు ఆడపిల్లల తండ్రి! లాయర్ ప్రాక్టీస్ 'నిల్' అయినా చింతలేదు. ఏదో కాలక్షేపం కోసం కోర్టుకి వెళ్లి వస్తాడన్నమాటే గాని వృత్తిపరమైన ఆదాయం లేదని వర్రీఅవడు.

స్వగ్రామంలో ఆయనకు వందెకరాల సుక్షేత్రమైన మాగాణిపోలంవుంది. దాన్ని కవులుకిచ్చాడు. అక్కడొక స్వంత ఇల్లూ ఉంది. దాన్ని అద్దెకిచ్చాడు. వీలున్నప్పుడల్లా స్వగ్రామం వెళ్లి పొలం వ్యవహారాలు చూచుకుని వస్తూంటాడు. బోలెడంత డబ్బు! బంగారు నగలకేం కొదవలేదు. భార్యకు ఏడువారాల నగలు వున్నయ్. ముగ్గురాడపిల్లలకు కావలసినన్ని ఆభరణాలను ఎవరికి ఏది కావాలంటే అది చేయించి పెట్టాడు.

చీకు చింతలేని మనిషి! ముగ్గురు అమ్మాయిలను బాగా చదవించాడు. వాళ్ల నోరు తెరిచి కావాలన్నదల్లా ఇచ్చాడు. మగపిల్లలు లేరనే దిగుల్లేదు. కూతుళ్లను మగపిల్లల్లాగానే పెంచాడు. తన యావదాస్తికి ఆముగ్గురే వారసులు!

టౌన్లో వెయ్యి గజాల స్థలంలో అన్ని సదుపాయాలతో మంచి బంగళా కట్టించాడు. ఎవరి గది వారికి సపరేట్! దాని ఎటాచ్డ్ బాత్‌రూమ్... గీజరు! ప్రతి బెడ్‌రూమ్‌కు ఎ.సి.! డబల్‌డోర్ ఫ్రిడ్జ్... లాంగ్ డైనింగ్ టేబుల్... ఛైర్స్... సోఫాసెట్లతో ఇల్లు హంగుగా వుంటుంది. ఎవరి సెల్‌ఫోన్ వారికుంది.

రాఘవరావ్ కోర్టుకు వెళ్లి రావటానికికొక కారు... మరొకటి భార్యా పిల్లలు అవసరాల కోసం! ఆడపిల్లల ముగ్గురికీ డ్రైవింగ్ వచ్చు! కారు ఎప్పుడైనా అవసరానికి వాడతారు. మిగతా వేళల్లో షెడ్‌లోనే వుంటుంది. ఎవరి టూ వీలర్ వారి రోజూ వాడకానికి వుండనే వున్నయ్. పెట్రోల్ ధరలు పెరుగుతున్నా... కొనలేకపోతున్నామనే చింతలేదెవ్వరికీ.

విధవరాలైన చెల్లెలు చామంతి తనకు బరువని ఏనాడు అనుకోని మనిషి రాఘవరావు. చామంతి వివాహమైన నాలుగేళ్లకే భర్త యాక్సిడెంట్‌లో చనిపోవటం... రాఘవరావు కుటుంబానికి పెద్ద షాక్ అయింది. చామంతికి పిల్లలేరు. చెల్లెలి బాధ్యత తన భుజస్కందాల మీదేసుకోక తప్పలేదు. మళ్లీ వివాహం చేసుకోమంటూ ఎన్నో

సార్లు రాఘవరావు దంపతులు బ్రతిమాలినా పునర్వివాహానికి 'నో' చెప్పింది చామంతి.

చామంతి డిగ్రీ చదివింది! వుద్యోగం చేయటం కూడా ఆమెకు ఇష్టం లేదు. మనిషిని చూస్తే వైధవ్యం ప్రాప్తించిన ఆడమనిషిలా అన్పించదు! రచయిత్రి కావాలనేది చామంతి ఆకాంక్ష! తెలుగు సాహిత్యానికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు చెల్లెలి వుత్సాహం చూసి కొనిపెట్టాడు రాఘవరావు.

చామంతి రాసే కథలు తరచు పత్రికల్లో దర్శనమిస్తూంటయ్! ఒక్క నిముషం ఖాళీగా వుండదు. ఎప్పుడూ ఏదో రాస్తూనే ఉంటుంది.

ఇంటిపని వంటపని చేయటానికి మనుషులున్నారు. రాఘవరావు శ్రీమతి భాగ్యలక్ష్మి గాని పిల్లలుగాని చామంతి గాని ఇంట్లో చేయాల్సిన పనేవుండదు.

బుర్ర వేడెక్కినప్పుడు... రిలాక్స్ అవటానికి ఏదైన వీక్లీ చదువుతుంది. అదీ బోర్ కొట్టినప్పుడు తన బెడ్‌రూమ్‌లో టి.వి.లో ప్రోగ్రామ్స్ చూస్తుంటుంది. చామంతి! తెలుగు సీరియల్స్ పట్ల అంత 'ఇన్‌ట్రెస్ట్' చూపదు.

చామంతి రాసిన మొట్టమొదటి నవలకు ఓ పత్రిక నిర్వహించిన ఉగాది నవలల పోటీలో ప్రథమ బహుమతి యాభైవేలు గెల్చుకుంది. తనకు బహుమతి... అందునా ఫస్ట్ ప్రైజ్ రావడంతో మనసు ఆనందంలో వుప్పొంగింది.

'కథలు మానేసి నవలలు రాసెయ్ అత్తా... ఎర్నింగ్ బాగుంటుంది! పేరుకు పేరు డబ్బుకు డబ్బు... కదూ?!' రెండవ అమ్మాయి సౌజన్య అంది.

'ఐడియాలు నాకు బోలెడన్ని వస్తయ్. కానీ వాటిని కాగితం మీద పెట్టటం చేతకావటం లేదత్తా...' మూడవది నీరజ దిగాలుపడి చెప్పింది.

'ముందు చదవటం నేర్చుకో నీరజా! వివిధ రచయితలు రాయటం ఎలా ఉంటుందో మనకు ఒంటపడుతుంది. ఆ తర్వాత రాయాలనే ఆలోచన దానంతట అదే వస్తుంది కొత్త కొత్త ఆలోచనలు మనసులో మొలకెత్తుతయ్...! చామంతి తన అనుభవాన్ని జోడించి చెప్పింది.

'క్లాస్ బుక్స్ చదవాలంటేనే బోర్‌గా వుంటుంది ఇక సాహిత్యం వంట పట్టించుకోవటం నావల్ల కాదు..!

ముగ్గురూ గలగలా నవ్వుకున్నారు.

× × × × ×

పిల్లలకు వివాహం చెయ్యాలని ఎన్నో సంబంధాలు చూశాడు రాఘవరావు. పిల్లనచ్చింది.. జాతకాలు కుదిరాయి అంటారే గానీ.. చివరికి జారుకోవటం చూస్తూ కంగారు పడేవాడు.

అనేక మంచి సంబంధాలు మిస్ అవటంతో మనిషిలో దిగులు మొదలైంది! తానెంత కట్నమైనా ఇవ్వగలడు. పిల్లలు అందంగానే వుంటారు! పెద్దది డిగ్రీతో ఫుల్ స్టాప్ పెట్టినా మిగతా ఇద్దరూ పి.జి. లు చేశారు.

కానీ ఏ సంబంధం వచ్చినా చివరికి బెడిసి కొడుతోంది. కారణం రాఘవరావుకి తెలియనది కాదు.

ఎన్నో ప్లస్‌పాయింట్స్ ఉన్నా... ఒకే ఒక్క మైనస్ పాయింట్ వున్న కారణంగా పిల్లల పెళ్లిళ్లు చివరిదాకా వచ్చి ఆగిపోతున్నయ్.

పత్రికల్లో ప్రకటనలిచ్చాడు! మ్యారేజ్ బ్యూరోలను సంప్రదించాడు! వివాహవేదికలకూ అటెండ్ అయినాడు.

పెళ్లిళ్లు కాకపోవటానికి కారణమేంటో తనకు తెల్సు! తెలిసీ బాధపడక తప్పటం లేదు. కుమార్తెలకు వయసు మించిపోతోంది. వీళ్ల ఖర్మ ఇంతేనా? వీళ్లకు పెళ్లిళ్లు అయ్యే అదృష్టమేలేదా?

వచ్చిన సంబంధాలు ఫెయిల్ కావటానికి ముఖ్య కారణం తన తల్లి! తనకు జన్మనిచ్చిన మాతృమూర్తి దయనీయ స్థితి చూస్తూ నోరు పెదపలేని పరిస్థితి! తనకు పెళ్లి అయ్యే వరకు తల్లి ఆరోగ్యంగ ఆనందంగా వున్న విషయం తనకు తెలియనిది కాదు. నాన్న గారు హార్ట్ ఎటాక్‌తో సడన్‌గా పోవటంతో తల్లి మానసిక స్థితి ఆందోళనకుగురైంది. మానసికంగా దెబ్బతిన్నది. ఎవరి ఓదార్పు మాటలూ తల్లిలో వెనుకటి వుత్సాహాన్ని తిరిగి ఇవ్వలేకపోయినయ్!

'ఎందుకండీ అనవసరంగ దిగులు పడతారు?- పరిష్కారం దొరకని సమస్య మనది....'

'అమ్మను నేను శానిటోరియంలో జాయిన్ చేశానా... రెండు నెలలైనా తిరక్కుండానే నానా రభస చేసి తిరిగి ఇంటి కొచ్చె! ఆమె చిన్న పిల్లేంకాదుగా కట్టిపడేయటానికి గోల భరించలేక డిశ్చార్జి చేసి చేతులు దులిపేసుకున్నారు...'

'అత్తగారి జబ్బు అంటువ్యాధి కాదని... ఎవ్వరూ భయపడవలసిన అవసరం

లేదని డాక్టర్లు మనకు నచ్చజెప్పారు. కానీ... వచ్చే సంబంధాలన్నీ ఆమె కారణంగానేకడదాకా వచ్చి విషయం తెలుసుకుని జారిపోతున్నయ్! అంతా మన దురదృష్టం... ఏనాడో చేసుకున్న పాప ఖర్మ ఫలితమన్పిస్తోందండీ....!

'ఈ సమస్యకు పరిష్కారం ఎవరి చేతుల్లోనూలేదే!... అదేవుడే మనకో మార్గం చూపాలి... అంతే!

'పోనీ మన స్వగ్రామంలో వున్న ఇంట్లో అమ్మను వుంచి ఇంటి పన్లు చూచుకోవటానికి... అవసరాలు తీర్చటానికి వంట చేసి పెట్టేందుకు ఓ ఆడమనిషి పెడదామనుకుంటే... నా మాటవింటేగా?... చావనైనా చస్తానుగానీ.. పల్లెటూళ్లో నాకు దూరంగ వుండని మొండికేసిందాయె?... అటు కన్న తల్లి.. ఇటు పెళ్లి కాని కూతుళ్లు... మధ్య నా చావుకొచ్చిపడింది...! నెత్తి కొట్టుకున్నాడు రాఘవరావు.

'మనమీ విధంగా బాధపడుతున్నామని పిల్లలకు ఎక్కడ తెలుస్తుందోని భయంతో వణికిపోతున్నాను!...'

'పిచ్చిదానా!... వాళ్లకు తెలియదనా? ఎదిగిన పిల్లలే వాళ్లు!... వాళ్ల దగ్గరేం దాచలేం...'

'అన్నట్టు పెద్దది ఫారిన్ వెడతానంటున్నది పై చదువుల కోసం...'

'ఈ సమస్య మధ్య నలిగిపోవటం ఇష్టం లేకనే సౌమిత్రి అలాంటి నిర్ణయానికొచ్చి వుంటుంది. సమస్యలకు భయపడి పారిపోకుండా... ధైర్యంగ ఎదుర్కోవాలని దానికి నేను నచ్చజెప్తాలే...!

'సరే పడుకోండి... నాకు నిద్ర వస్తోంది...' భాగ్యలక్ష్మి వెళ్లి పక్కమంచంమీద పడుకున్నది.

× × × × ×

ఒరే 'పి.పి' నా ప్రాబ్లమ్‌కు ఒక మంచి సొల్యూషన్ చెప్పరా...! రాజారామ్‌ను వెంటపెట్టుకుని ఎదురుగా వున్న హోటల్లోకి నడుస్తూ అడిగేడు

'నువ్వు ముందునన్ను 'పి.పి' అని పిలవటంమానుకుంటేనే నానుండి నీకు ఆన్సరొస్తుంది...'

'కోప్పడకురా.. మనమిద్దరం 'లా' చదివే నాటినుండి ఆప్త మిత్రులం కదా... అచనువుతోనే నువ్వు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనే నీ డిజిగ్నేషన్ కొండవీటి చాన్తాడంత

పొడుగ్గా వుంది కదానే సింపుల్‌గ అలా పిలుస్తున్నానంతే... కోపం తెచ్చుకోకు రాజారామ్'.

'ఇలా పేరు పెట్టి పిలిస్తేనే నాకు ఆనందం!'

ఇద్దరూ కోర్టుకు ఎదురుగా వున్న ఉడిపి హోటల్లో కొచ్చి ఎదురెదురు కుర్చీల్లో కూర్చున్నారు.

రెండు కాఫీ ఆర్డరిచ్చాడు రాఘవరావు.

'నీ ప్రాబ్లమ్ సాల్వ్ కావాలంటే ఒకటే ఒక్క మార్గం!...' చెప్తూ ఆగేడు రాజారామ్.

'అదేమిటో సెలవీయ్...

'అది మన చేతుల్లో లేదు... పోనీ ఒక పనిచెయ్. మీ అమ్మ గారి గొంతు పిసికి చంపెయ్. కాకపోతే ఆమెకు పెట్టే భోజనంలో పాయిజన్ కలుపు....'

'నోర్ముయ్యరా! తల్లిని చంపిన ఘాతకుడని న్యూస్ వచ్చేస్తుంది. నా చేతులకు సంకెళ్లు... తర్వాత ఉరిశిక్ష! ఇదంతా ఇప్పుడు అవసరమా?-' నొసలు చిట్లించాడు రాఘవరావు.

'కదా? నీ ముగ్గురి డాటర్స్‌కు మేరేజెస్ కావాలీ అంటే మీ మమ్మీ అడ్డుగా వుంది ఆమెను సీన్లోంచి తప్పించేస్తే లైన్‌క్లియరవుతుంది. నీ ప్రాబ్లమూ తీరుతుంది. యూవర్రైట్?-' కాఫీ సిప్ చేస్తూ తాపీగ మాట్లాడేడు రాజారామ్.

'ఆవిడ సెంచరీ కొట్టేట్టుందిరా... కన్న కొడుకునై వుండి, జన్మనిచ్చిన తల్లి గురించి ఈ విధంగా మాట్లాడటం పాపమే కాదు నేరం కూడా' మనసులో లెంపలేసుకున్నాడు రాఘవరావు.

'చూడు ఫ్రెండూ... మీ మదర్‌కున్న వ్యాధి సాధారణమైనది కాదు. అంతా అసహ్యించుకునే కుష్ఠువ్యాధి విషయం తెల్సిన వారెవరూ నీ కుమార్తెలను పెళ్లి చేసుకునేటందుకు ముందుకు రారు! ఇదే కదానీ ప్రాబ్లమ్! దీన్ని భగవంతుడే సాల్వ్ చేయాలి...!

'అంతేనంటావా?-'

'సెంట్‌పర్సెంట్ అంతే! నీ డాటర్స్‌కు వయసు మించిపోయినా సరే నువ్వు మీ మదర్‌కు తలకొరివి పెట్టే దాకా ఓర్పుగా ఆగాలి! దట్సాల్!!-'

ఇద్దరూ లేచి బైటికొచ్చి మళ్లీ నడుస్తూ వెళ్లి కోర్టుమెట్లెక్కారు

× × × × ×

చామంతి పరుగుపరుగున వచ్చి 'అన్నయ్యా... అమ్మ పిలిస్తే పలకటం లేదు. నువ్వొకసారి రావాలి... అర్జంట్....' అని కంగారుపడుతూ చెప్పటంతో రాఘవరావు... పక్కనేవున్న భార్య భాగ్యలక్ష్మి దోడ్లో చివరగా వున్న పాకవైపు దారి తీశారు.

తల్లిని చేరుకోగానో 'అమ్మా... అమ్మా' అంటూ పిలిచాడు. బదులుపలక్కపోవటంతో ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని పల్స్ చూశాడు. నాడి కొట్టుకుంటున్నట్టన్పించకపోవటంతో ముక్కు దగ్గర వేలు పెట్టి చూసి 'శ్వాస ఆడటం లేదే!' అని గొణుక్కుని ఓసారి వెంటనే ఇంటికి రమ్మని ఫామిలీ డాక్టర్‌కు ఫోన్ చేశాడు రాఘవరావు.

పదినిముషాల్లో రాఘవరావు ఇంట్లో వాలిన డాక్టర్ చకప్ చేసి 'జస్ట్.... హాఫనవర్ అయివుంటుంది మీ మదర్ మరణించి...' డౌట్ కన్ఫర్మ్ చేసి వెళ్లిపోయాడు.

వయసులో పెద్ద వాడైనా నా తల్లి మరణించిందనే వాస్తవం అతడిని కలవరపరిచింది. అప్రయత్నంగ కళ్లు చమర్చినయ్.

కుటుంబ సభ్యులంతా అక్కడ కుప్పకూలి.... అత్తగారు పోయినందుకు భాగ్యలక్ష్మి... నాయనమ్మ మరణించి నందుకు ముగ్గురు ఆడపిల్లలూ... తల్లి చనిపోయినందుకు రాఘవరావు చామంతి ఘొల్లుమన్నారు.

ఇక భయంలేదు. ముగ్గురు ఆడపిల్లల వివాహాలు ఒకే ముహుర్తానికి చేసేయచ్చు అనేసి మనసులో గొణుక్కుంది భాగ్యలక్ష్మి లైన్‌క్లియరైనందుకు!!

(విశాలాక్షి - మాసపత్రికలో ప్రచురితం)